నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్ శుక్రవారం 29 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్

సైన్స్ పరిజ్ఞానాన్ని పెంచాలి

● కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, నవంబర్ 28 : మూఢ నమ్మకాలను దూరం చేయాలంటే విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని పెంచాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి చెక్ ముఖి సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయిలో చెక్ ముఖి సైన్స్ టాలెంట్ టెస్టు ఉంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటపర్తి ఊశన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ప్రణీత, సెక్టోరియల్ అధికారి నారాయణ, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నూతల రవీందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీ.ఉమాకాంత్, పి.ఊశన్న, జిల్లా నాయకులు సంతోష్ కుమార్, నాగరాజు, లింగన్న, శ్రీధర్ బాబు, ఆత్రం సంతోష్, లింగారెడ్డి, ప్రేమ్ కుమార్, గంగన్న, మెస్రం రాజు రంజిత్, బైరి సతీశ్, కిరణ్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి..

సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల గణన, సమగ్ర సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్, విద్యార్థి కళాశాల, సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలను కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు. ఇందులో కొనసాగుతున్న సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల ముఠా అరెస్టు

జైనథ్, నవంబర్ 28 : దీపాయిగూడ ఎక్స్ రోడ్డు వద్ద అక్రమంగా గ్యాస్ సిలిండర్లు తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను గురువారం మధ్యాహ్నం పోలీసులు పట్టుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. జైనథ్ గ్రామ శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాం నుంచి సిలిండర్లను ఈనెల 21న అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో అద్దె వాహనం (ఎంఎస్34 బీజడ్ 0417)లో గ్యాస్ గోదాం తాళం పగులగొట్టి 74 సిలిండర్లను దొంగిలించారన్నారు. వీరి నుంచి 64 నిండు, పది ఖాళీ సిలిండర్లను, రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పారుగు రాష్ట్రమైన రాజస్థాన్ కు వెళ్తుంటే పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. ఏ-1గా లాదురాం, ఏ-2గా ప్రకాశ్‌ను చేర్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, ఏఎస్సై సిరాజ్ ఖాన్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

గిరిజన, గిరిజనేతరులకు రుణమాఫీ చేయాలి..

ఉట్నూర్, నవంబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన మాదిరిగా గిరిజన, గిరిజనేతరులకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, లంబాడా హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భారత చౌహాన్, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వినాయక్ చౌక్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

నేడే దీక్షా దివస్

ఆదిలాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహణ

నాయకులతో కలిసి దీక్షా దివస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

● ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతాం : మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్, నవంబర్ 28(నమస్తే తెలంగాణ) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నవంబరు 29వ తేదీన దీక్ష చేపట్టిన రోజును పురస్కరించుకుని నేడు(శుక్రవారం) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ నిర్వహించనున్నారు. ఇందుకోసం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతుండగా.. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి దీక్షా దివస్ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌తో పాటు మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఇతర నాయకులు హాజరవుతారు. ఈ నెల 26న దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించగా.. ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్, మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యేలు నాయకులకు సూచనలు, సలహాలు అందజేశారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతాం.. : మాజీ మంత్రి జోగు రామన్న

11 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని, 11 నెలల కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవాలను ఎందుకు జరుపుతుందో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, రూ.4 వేల పింఛన్లు, మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారంతోపాటు 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన అక్రమ కేసులు, భూ కబ్జాలకు ఎక్కువయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, రౌతు మనోహర్, యూనిస్ అక్బానీ, సాజిదొద్దీన్, విజ్జిగిరి నారాయణ, యాసం నర్సింగరావు, దాసరి రమేశ్, ఆడప తిరుపతి, కుమ్ర రాజు, మెస్రం పరమేశ్వర్, బట్టు, సతీశ్, నవేతే శ్రీనివాస్, దయానంద్, మౌర్య, సురేందర్, కలీం, మహేశ్ పాల్గొన్నారు.

కడ్తాల్ వద్ద ఒకే దారిలో ఇరువైపులా వెళ్తున్న వాహనాలు

బాబోయ్.. కడ్తాల్ వై జంక్షన్

అనునిత్యం ప్రమాదాలకు నిలయంగా చౌరస్తా

● సరైన అండర్ వే నిర్మాణం చేపట్టకపోవడమే కారణం

● ఎదురెదురు ప్రయాణంతో వాహనదారులకు అవస్థలు ● ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ల దృష్టికి సమస్య

సోన్, నవంబర్ 28 : సోన్ మండలంలోని కడ్తాల్ 'వై' జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. అనునిత్యం వాహనదారులు ఎదురెదురుగా ఢీకొనుచుండడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. జాతీయ రహదారి-44పై అండర్ బ్రిడ్జి నిర్మాణం సరైన విధంగా చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపు రూ.60 కోట్లతో నిర్మించిన అండర్ బ్రిడ్జి సరైన రీతిలో లేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు.. హైదరాబాద్ నుంచి నిర్మల్ వచ్చే వాహనాలు ఈ సర్వీసు రోడ్డులో ఎదురెదురుగా ప్రయాణించాల్సి వస్తున్నది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రామాలయం వెళ్లే భక్తులు భయపడాల్సి వస్తున్నది. దీంతో రాత్రివేళ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు పేర్కొంటున్నారు. గత నెలలో దాదాపు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరగగా.. నిర్మల్, సోఫినగర్ దాటిన తర్వాత జాతీయ రహదారి 44కు చేరుకునే క్రమంలో కడ్తాల్ వై జంక్షన్ నుంచి కుడివైపున ప్రయాణించాల్సి వస్తున్నది. ఇదే క్రమంలో హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు రావాల్సిన వాహనాలు కూడా ఎడమ వైపు నుంచి జాతీయ రహదారిని దిగి అదే దారిలో రానుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ అంశంపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్తులు వివరించారు.

❖ సమస్యను పరిష్కరించండి..

నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు.. హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వచ్చే వాహనాలు బ్రిడ్జి వద్ద ఒకే దారిలో వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వచ్చే వాహనదారులకు కడ్తాల్ 'వై' జంక్షన్ వచ్చే వరకు తెలియకపోవడంతో రోడ్డును దింపి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఈ సమస్యను ఎన్‌హెచ్ పీడీ, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లాం. - బర్మ రవి, వీడీసీ చైర్మన్, కడ్తాల్

❖ ఇబ్బందులుంటే పరిశీలిస్తాం..

ప్రస్తుతం కడ్తాల్ వద్ద నిర్మించిన అండర్ వే బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ సర్వీసు రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, సైన్‌బోర్డు వంటి వాటిని ఏర్పాటు చేస్తాం. అప్పటివరకు వాహనాలు 20-40 కిలోమీటర్ల వేగంతోనే వెళ్లాలి. కానీ.. స్పీడ్‌తో వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం వర్క్ పూర్తి అయ్యాక కూడా ఇలా ప్రమాదాలు జరిగితే మేము అప్పుడు ఆలోచించి నిర్ణయం తీసుకొని ఇబ్బందుల్లేకుండా చూస్తాం. - శ్రీనివాస్‌రావు, ఎన్‌హెచ్‌పీడీ

కరంజి(టి)లో చలిమంట వద్ద జనం


అర్లి(టి)లో ఎడ్లకు కప్పిన గోనెలు

గజ గజ

అర్లి(టి)లో 8.7 కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

భీంపూర్ మండలంలోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో గల అర్లి(టి) గ్రామంలో గురువారం కనిష్ఠంగా 8.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది రాష్ట్రంలోనే అత్యల్పం కాగా.. అర్లి సహా పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలోని కరంజి, గుబిడి, టేకిడిరాంపూర్, కొజ్జన్‌గూడ, గోముత్రి, అంతర్గాం, వడూర్, గొల్లగడ్, తాంసి(కె) గ్రామాల్లో చలి అధికంగా ఉన్నది. రైతులు, కూలీలు ఉదయం 10 గంటల తర్వాతనే చేలకు వెళ్తున్నారు. ఉదయం, రాత్రి చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. చలి దృష్ట్యా పశువులపై రక్షణగా గోనె సంచులు కప్పుతున్నారు.
- భీంపూర్, నవంబర్ 28

గుబిడిలో చలిమంట వేసుకున్న స్థానికులు

భారత రాజ్యాంగంపై బీజేపీ బుల్డోజర్

● దళితులు, గిరిజనుల హక్కులు కాలరాస్తోంది.. ● రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ స్వీకరించలేదు..

● కార్మికుల హక్కుల కోసం సంఘటితంగా పోరాడుదాం ● రాజ్యసభ మాజీ సభ్యురాలు, బృందాకారత్

● ఆదిలాబాద్ లో సీఐటీయూ కార్యాలయం ప్రారంభం

ఎదులాపురం,నవంబర్ 28 : భారత రాజ్యాంగంపై బీజేపీ ప్రభుత్వం బల్డోజర్‌ను ప్రయోగిస్తోందని.. పలుమార్లు సవరణలు చేస్తూ దళితులు, గిరిజనుల హక్కులను కాలరాస్తోందని రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్ మండిపడ్డారు. ఇది బీజేపీ ప్రభుత్వం కాదని.. ఆర్ఎస్ఎస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. 1950 నుంచి ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని ఎప్పుడూ స్వీకరించలేదని.. దేశంలో మనుస్మృతి అమలు చేయాలని కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం రెండు తుపాకీ గొట్టాలతో పాలిస్తోందని, ఇందులో ఒకదానికి కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా వినియోగిస్తుండగా.. మరో గొట్టంతో దేశంలో వివిధ వర్గాల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి ఉపయోగిస్తోందని తెలిపారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమె నూతనంగా నిర్మించిన బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం(సీఐటీయూ జిల్లా కార్యాలయం)ను ప్రారంభించారు. అనంతరం ఆర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో కార్మికులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ విధానాలతో బీజేపీ ముందుకు సాగుతోందన్నారు. బ్రిటీషు వారు ఏ విధంగానైతే విభజించి పాలించే సూత్రాన్ని పాటించారో అదే సూత్రాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేండ్ల నుంచి అనుసరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో రాజ్యాంగం గురించి గొప్పలు చెప్పిన ప్రధాని మోదీ.. దానికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగంలో నిమ్నజాతులకు హక్కులు కల్పించిందని.. కానీ.. వీటిని వ్యతిరేకిస్తూ మనుస్మృతిని అమలు చేసేందుకు పూనుకుంటోందని విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన మన్యం వీరుడు కుమ్రం భీం పోరాటం, రాంజీ గోండ్ చేసిన త్యాగాలను ఆమె స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి బి.చంద్రకుమార్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, మాజీ ఎంపీ మీడియం బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, కోశాధికారి కె.సునీత, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు, రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యురాలు, బృందాకారత్

సర్వే వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 28 : అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీవో జీవరత్నం, ఎంపీడీవో గజానంద్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి.. : రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో విద్యాశాఖ, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, హెడ్ కుక్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం 18 కేజీబీవీలకు రెండేసి చొప్పున 36 పరికాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, అధికారులు కరుణ, పద్మ, వెంకటరమణ, లింబాద్రి పాల్గొన్నారు.

రైతుల సమష్టి విజయం..

కాళోజీ అవార్డు గ్రహీత జయరాజ్

దిలావర్‌పూర్, నవంబర్ 28 : ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయడం రైతుల సమష్టి విజయమని ప్రజాకవి, కాళోజీ అవార్డు గ్రహీత జయరాజ్ అన్నారు. గురువారం మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లీ గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని కోరుతూ పోరాటం చేసిన రైతులను ఆయన కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులను తరలించేందుకు రైతులు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని రాష్ట్ర కార్యదర్శి రమేశ్, విజ్ఞాన దర్శిని జిల్లా అధ్యక్షులు ఆకుల సుదర్శన్, నాయకులు బాజిరెడ్డి, రామకృష్ణ, మురళీధర్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ప్రజాకవి, కాళోజీ అవార్డు గ్రహీత జయరాజ్